ఓంశ్రీసాయిరాం

## దైవప్రీతి పాపభీతి సంఘనీతి

పునర్విత్తం పునర్మిత్రం పునర్భార్యా పునర్మహీః
ఏతత్సర్వం పునర్లభ్యం న శరీరం పునః పునః

ప్రేమస్వరూపులైన యువతీయువకులారా!

భావి ప్రపంచ పౌరులారా!

ధనము కోల్పోయిన మరల సంపాదించుకోవచ్చు. మిత్రుడు పోయినప్పటికీ మరోక మిత్రుని సంపాదించుకోవచ్చు. భార్య పోయినప్పటికీ మరొక వివాహమాడవచ్చు. భూమిని కోల్పోయిన తిరిగి మనము దానిని సంపాదించుకోవచ్చు. శరీరము పోతే తిరిగి మనము సంపాదించుకోలేము. అనంత జగత్తులో అఖిల ప్రాణికోటిలో మానవుడు అత్యంత ఉన్నతుడు. మానవుడు ఉత్కృష్టమైనవాడు. సౌజన్య సౌశీల్యముతో కూడినవాడు. ఇట్టి మానవత్వమును కోల్పోయిన యింక తిరిగి మనకు లభ్యము కాదు.

ప్రవర్తన..కాల, కారణ, కర్తవ్యాదులు

యువతీయువకులారా!

ఈనాడు యావత్ప్రపంచ సౌభాగ్యము, ఉన్నతి ఈనాటి యువతీయువకుల ప్రవర్తనపై ఆధారపడియున్నది. యువతీ యువకుల ప్రవర్తన ఉత్తమమైనప్పుడే ఈ ప్రపంచము కూడా ఉత్తమ ఆధర్శమును అనుభవించగలదు. గడచిపోయిన రాత్రిని ఎంత మనము ప్రయత్నము చేసినా ప్రాప్తించదు. అనంతమైన సాగరములో లీనమైన యమునా నదిని ఎంత పిలచినా రాదు. మనము బాగుగా నమిలి మింగిన ఫలము తిరిగి వెనుకకు తీసుకోలేము. కానీ, మానవుడు తన రోజులను మోజులతో గడుపుకుంటున్నాడే గానీ ముందు ఏమి జరుగునో అనే సత్యము గుర్తించుకోలేక పోతున్నాడు. సూర్యుడు తన కిరణముల ద్వారా జలమును ఎట్లు ఆవిరి గావించి హరించుచున్నాడో అదేవిధముగా రాత్రింబవళ్లు మానవుని ఆయుః ప్రమాణమును అంత్యము గావించుచున్నవనే సత్యము మానవుడు గుర్తించుకోలేక పోతున్నాడు. జీవితము ఒక పెద్ద గడియారము వంటిది. ఇందులో సంవత్సరములు, నెలలు, దినములు అనే మూడు ముళ్లు బాగుగా తిరుగుతున్నాయి. ముళ్లు సక్రమముగా తిరుగుతున్నాయని మనము ఆనందిస్తున్నామే గానీ తిరిగి త్వరలోనే గణగణమని గంటలు మ్రోగిస్తున్నది. కానీ, మనము ఈ గంటల విషయమును గుర్తించుకోలేక పోతున్నాము. దినములే సెకనుల ముల్లు. నెలలే నిముషముల ముల్లు. సంవత్సరములే గంటల ముల్లు. మనము ఈ దినములు, నెలలు, సంవత్సరములు తిరుగుచున్నది చూచున్నామే గానీ అందులో తరిగిపోయే ఆయుఃప్రమాణము గుర్తించటం లేదు.

ఈ కాలము గడవక పూర్వమే కర్తవ్యమును గుర్తించి వర్తించాలి. మానవుడు ఈ జగత్తునందు అవతరించుటకు మూల కారణము ఏమిటి? ఈ మానవుని కర్తవ్యం ఏమిటి? ఇలాంటి కర్తవ్యము మనము గుర్తించి జీవితము గడుపుటకు ప్రయత్నించాలి. మానవత్వములో వుండిన దివ్యత్వమును, పవిత్రమును మనము గుర్తించుటకు ప్రయత్నించుట లేదు. జీవితంలో కాలము చాలా ప్రధానమైనది. కానీ, ఈ కాలాన్ని ఈనాటి యువతీయువకులు అమితముగా వ్యర్థము గావిస్తున్నారు. దీనిని వ్యర్థము గావించక సార్థకము గావించుటకు ప్రయత్నించాలి. కాలము వ్యర్థము చేయటంచేత జీవితము కూడా వ్యర్థమైపోతున్నది. కాలమును మనము సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టాలి.

*మతి, స్థితి, గతి, సంపత్తి.*

మానవునియందు రెండువిధములైన తత్వములు లీనమై ఉంటున్నాయి. ఒకటి పశుత్వం, రెండవది మానవత్వం. కానీ, ఈ మానవుడు అరిషడ్వర్గములైన కామ క్రోధ మోహ మద మాత్సర్యములనే తత్వములతో లీనమై, భగవంతుడు ప్రసాదించిన తనువు, ధనము సద్వినియోగ పరచుకొనక, ఈ మనస్సు యొక్క తత్వము చక్కగా గుర్తించక స్థితి, గతి, మతి, సంపత్తి దుర్వినియోగము చేసుకుంటున్నాడు. తద్వారా మానవత్వం కోల్పోతున్నాడు. దుర్వ్యసనములకు లోనై, దురభ్యాసముల పాలై, పతనమై పశువు వలె క్షీణించి పోతున్నాడు. ఇదియే మనయందున్న పశుత్వము యొక్క ప్రధాన ఫలితం. అట్లు కాకుండా మతి, స్థితి, గతి, సంపత్తిని సద్వినియోగపరచి, సదాచార సంపన్నుడై, సద్గుణాలను పోషించుకొని, ధర్మమార్గమున ప్రవేశించి, తన జీవితమును మానవత్వముగా మార్చుకోటమే కాకుండా మాధవత్వముగా మార్చుకొనుటకు అవకాశముంటుంది. ప్రపంచములో ఉండిన సమస్త పదార్థములు కూడా మనం సద్వినియోగం చేసుకోవాలి. ఒక కత్తి ఉన్నది. ఈ కత్తితో కూరగాయలు తరిగి తరువాత కూర వండుకొని సుఖముగా భుజించవచ్చు. అదే కత్తితో ఫలమును తరిగి సుఖముగా భుజించి ఆనందము పొందవచ్చు. కానీ, అదే కత్తితో ఎదుటివాని గొంతు కోసి, మానవత్వమును కోల్పోయి రాక్షసత్వము నిరూపించుకోవచ్చు. దీనికి కత్తి కాదు కారణం. మానవుని మతియే దీనికి గతి. మతిని బట్టి గతి, గతిని బట్టి స్థితి, స్థితిని బట్టియే సంపత్తి. కానీ, ఈనాటి మానవుడు సంపత్తి నిమిత్తమై ప్రాకులాడుతున్నాడు, తన స్థితిని తాను గుర్తించుకోటం లేదు. ఈ స్థితిని గుర్తించుటకు తన గతిని సరైన రీతిలో మార్చుకోవాలి. దీనిని సరైన రీతిగా మార్చుకొనుటకు మతిని సరైన స్థితిలో పెట్టుకోవాలి. దీనినే వేదాంతము 'యద్భావం తద్భవతి' అన్నది. మన భావములను పురస్కరించుకొనియే మన ప్రవర్తన కొనసాగుతూ వస్తుంది. ఒక న్యూస్ పేపరుంది. ఆ న్యూస్ పేపరు మనము చూచినప్పుడు ఏవిధమైన దుర్గంధముగానీ, సుగంధముగానీ మనకు గోచరించదు. కానీ, ఆ న్యూస్ పేపరులో మల్లెపూలు పొట్లం కట్టినప్పుడు ఆ మల్లె పుష్పముల వలన ఆ న్యూస్ పేపరు మల్లె పుష్పముల వాసన పొందుతుంది. అదే న్యూస్ పేపరులో మనము పకోడీలు పొట్లం కట్టినప్పుడు ఆ న్యూస్ పేపరుకు పకోడీల వాసన వస్తుంది. అదే పేపరు లోపల డ్రై ఫిష్ పొట్లం కట్టినప్పుడు ఆ డ్రై ఫిష్ వాసన ఆ న్యూస్ పేపరుకు వస్తుంది. మన హృదయము పవిత్రమైనది. ఎట్టి దుర్గంధములు లేని న్యూస్ పేపరు వంటిది. ఇందులో ఏవిధమైన అభ్యాసములను, ఏవిధమైన తలంపులను మనము ప్రవేశపెడుదుమో దాని ప్రభావమే ఈ హృదయం పొందుతుంది.

Sow an action reap a tendency
Sow a tendency reap a habit
Sow a habit reap a character
Sow a character reap a destiny
You are the master of your destiny
Tou can do or undo.

మన మంచిచెడ్డలన్నీ మన భావములపైనే ఆధారపడి ఉంటున్నాయి. మన ప్రవర్తనపైనే ఆధారపడి ఉంటున్నాయి. మన ప్రవర్తనలు చాలా ఉత్తమమైనవిగా ఉండాలి. మానవత్వంలో ఎంతో దివ్యత్వం యిమిడి ఉంటున్నది. ప్రపంచము యొక్క మంచి చెడ్డలన్నీ మానవుని ప్రవర్తనపై ఆధారపడి ఉంటున్నాయి.

*సత్సంగం..సంఘసేవ*

ఈనాడు జగత్తులో ఎందు చూచినా దుఃఖం, భయం, అశాంతి, అల్లకల్లోలములుగా మనకు కనిపిస్తున్నాయి. ఇట్టి పరిస్థితికి మూలకారణము ఏమిటి? ఏ దేశంలో ఉత్తమ గుణవంతులైన స్త్రీ పురుషులుందురో

ఆ దేశము నిరంతరం పవిత్రంగానే వుంటుంది. ఈనాడు దేశం యొక్క పరిస్థితి ఈ దుస్థితికి రావటానికి కారణం ఏమిటి? ప్రజలలో ఉత్తమ గుణవంతులైన స్త్రీ పరుషులు లేకపోవటమే కారణము. దేశమును రక్షించుటకు అస్త్రశస్త్రములు కాదు ప్రధానము. ఆటంబాంబులు కాదు ప్రధానము. గుణశీలురైన స్త్రీ పురుషులు అత్యవసరము. ప్రపంచము యొక్క మంచి చెడ్డలు యువతీయువకులపై ఆధారపడి ఉంటున్నవి. ఈనాటి యువతీయువకులు పవిత్రమైన భావముచేత, నిర్మల చిత్తముచేత, నిస్వార్థమైన సేవలో ప్రవేశించి దేశమునకు ఆనందము నందించాలి. సత్సంగములో ప్రవేశించాలి. సత్సంగమనగా మంచివారితో స్నేహమనుకుంటారు. కాదు కాదు. సత్ అనగా దైవత్వమే. అదియే being. అదియే శాశ్వతమైనది. దానితో మన సంగమును అభివృద్ధి పరచుకోవాలి. చేదు పోవుటకు, తీపి అభివృద్ధి గాంచుటకు యిది పెద్ద ఆధారము. పాపములు, శాపములు తరగుటకు సత్సంగమే ఆధారము. ఇట్టి పవిత్రమైన సత్సంగమును ప్రపంచము కోల్పోయినది. మానవత్వమునే మంట గలిపినది.

పాపభీతి లేని పామరత్వముబట్టి
దైవప్రీతి లేనిదారి పట్టి
మావత్వమణగె మానవులందున
విశ్వశాంతికిదియె విప్లవంబు.

పాపభీతిని కోల్పోయినారు. దైవప్రీతినికూడా కోల్పోయినారు. ఈ రెండూ కోల్పోయిన తరువాత శాంతి యేరీతిగా మనకు లభ్యమౌతుంది? మొట్టమొదట పాపభీతిని , దైవప్రీతిని అభివృద్ధి గావించుకోవాలి.

మనము సంఘమునందే పుట్టాము. సంఘమునందే పెరిగాము. సంఘమునందే కీర్తి ప్రతిష్టలనందుకున్నాము. సంఘమునందే అనేక విద్యలు మనము నేర్చుకున్నాము. తెలివితేటలు పెంచుకున్నాము. మేధావులనే కీర్తిని పొందాము. ఇవన్నీ ఎక్కడనుండి మనకు ప్రాప్తించాయి? సమాజము నుండే మనకు ప్రాప్తించాయి. ఇన్నివిధములైన ఉన్నత స్థితులను, గతులను, మతులను సంఘము నుండి పొందినాము. ఇన్ని సమాజమునుండి అందుకొన్న యువతీయువకులు ఏ ఒక్కరైనా ఈ సమాజమునకు ఏవిధంగా మనము ఉపయోగపడాలి, కృతజ్ఞత ఏవిధంగా అందించాలి అని విచారణ చేస్తున్నారా? ఇన్ని పవిత్రమైన సద్గుణములు మనము అందుకున్నందుకు సమాజమునకు ఏ సేవ చేస్తున్నాము? ఏవిధమైన ప్రతిఫలము సమాజమునకందిస్తున్నాము? ఈవిధంగా తమను తాము ప్రశ్నించుకుంటే యేమాత్రమూ జవాబు రావటం లేదు. ఇదియే పెద్ద దోషము. ప్రతి మానవునికి కృతజ్ఞతను మనం చూపాలి. ఆ కృతజ్ఞత చూపే నిమిత్తమై సమాజములో నిస్వార్థ సేవ చేయాలి. ఆ నిస్వార్థ సేవయే ఈ సమాజమునకందించే ప్రధానమైన సేవ. ఈ కారణమును పురస్కరించుకొనియే సమాజసేవ అని ప్రారంభించాము. కానీ, ఈనాడు సమాజసేవ ఎక్కడా కనిపించటం లేదు. ఈ సేవ ద్వారా పేరు ప్రఖ్యాతులు పొందుతున్నారేగానీ తనయొక్క అంకితమును యేమాత్రమూ అనుభవించటము లేదు. శరీరము సమాజమునకు అంకితము గావించే నిమిత్తము ఏర్పడింది. కారణం? ఈ మానవత్వము ఈ సమాజమునుండియే పోషింపబడుతున్నది. ఈ పోషింపబడే దేహము సద్గుణములచేత సమాజమునకు సరైన సేవ చేయాలి. సమాజ సంక్షేమము మనము గుర్తించాలి. ఈనాడు ఎక్కడ చూచినా పదవులందుగానీ, అధికారమునందుగానీ, వ్యాపారమునందుగానీ, రాజకీయమునందుగానీ, పాలకులయందుగానీ యేమాత్రమూ త్యాగము కనిపించటం లేదు. అన్ని రంగములయందు ఒక కఠినమైన కాలుష్యము ప్రారంభమైంది. ఈ మాలిన్యము మనము తుడవటానికి తగిన కృషి చేయాలి. అధికారులందుగానీ, మతాపితరులందుగానీ, మేధావులందుగానీ, విద్యావంతులయందుగానీ, అధ్యాపకులందుగానీ ఈవిధమైన కాలుష్యము నిండిపోయింది. గొప్పగొప్ప మేధావులమని గర్విస్తున్నారేగానీ మేధావిలో ఉండవలసిన వినయవిధేయతలు కన్పించటం లేదు. గొప్ప విద్యావంతుడనని గర్విస్తున్నాడేగానీ విద్యకు సంబంధించిన త్యాగము యితనిలో కనిపించటం లేదు. నేను గొప్ప అధికారినని గర్విస్తున్నాడేగానీ అధికారికి సంబంధించిన ఆచరణ యేమాత్రమూ కనిపించటం లేదు.

క్షమాభావమే సర్వస్వము

అన్నింటియందు పాపభీతి, దైవప్రీతి రెండూ ఉండాలి. దైవాన్ని ప్రేమించినప్పుడు జగత్తునే ప్రేమించినవాడౌతాడు. ఎవరు మనలను దండించినప్పటికీ, ఎవరు మనలను హింసించినప్పటికీ ఓర్పుతో దానిని

స్వీకరించాలి. ప్రపంచమంతా ఒక కుటుంబముగా మారిపోవాలి. ప్రపంచమంతా ఒక గృహము. ప్రతి మానవుడు అందులో సోదరుడే. brotherhood of man, fatherhood of god. అంతా తానే అనే యేకత్వము తాను అనుభవించాలి. ఈ ఏకత్వమును గుర్తించినప్పుడు ఇయతరులను బాధించుటకు ప్రయత్నించము. తన మెత్తని నాలుకను తన గట్టి పండ్లు కరుస్తాయి. ఈ పండ్లు నాలుకను కరచాయని పండ్లకు శిక్ష యిస్తామా? ఇవ్వటం లేదు. నాలుక నాదే, పండ్లు నావే. అదే విధముగా యితరులు మనలను హింసించినప్పటికి, దూషించినప్పటికి, బాధించినప్పటికి మనము వారిని క్షమించటానికి ప్రయత్నించాలి. ఈ యువకులందు క్షమా గుణము అత్యవసరమైనది. ఈ వయస్సులో ఉడుకు రక్తము ప్రవహిస్తుంటుంది. ఎవరేమన్నా చాలా క్రోధము వస్తుంది. చాలా తప్పు. మానవునికి ఉండవసిన గుణము కాదిది. శాంతముగా సహనముతో దీనిని సాధించటానికి ప్రయత్నించాలి.

క్షమ సత్యము క్షమ ధర్మము క్షమ వేదము క్షమ అహింస
క్షమ సంతోషము క్షమ దయ క్షమ సర్వస్వము సర్వలోకములందు.

ఈ క్షమను యువతీయువకులు ఆచరణలోపల సాధించుటకు ప్రయత్నించాలి. ఇట్టి సహన తత్త్వము ఆచరించుటయే నిజమైన ధర్మము. ఇట్టి ధర్మసమ్మతమైన మార్గమందు మానవత్వమును ప్రవేశపెట్టాలి.

ప్రేమస్వరూపులారా! మానవత్వములో ఎంత పవిత్ర గుణములున్నవో మీరు గుర్తించుటకు ప్రయత్నించాలి. అరిషడ్వర్గములైన కామక్రోధలోభ మదమాత్సర్యములు మృగ లక్షణములేగానీ మానవ లక్షణములు కావు. మానవత్వములో ఉండవలసిన లక్షణములు కావు. భయపెట్టేది మృగము. భయపడేది పశువు. నీవు మృగము కాదు, పశువు కాదు. నీవు భయపెట్ట కూడదు, భయపడ కూడదు. ఈ రెండింటికీ అతీతమై మానవత్వము నీవు ప్రదర్శించాలి. ఈనాటి యువతీయువకులు ప్రధానమైన గుణములు పెంచుకోవాలి. ఎవరిని నీవు భయపెట్ట వద్దు. ఎవరికీ నీవు భయపడ వద్దు. దేనికి భయపడాలి? పాపమునకు భయపడాలి. దైవమును ప్రేమించాలి. ప్రేమించవలసినది దైవమును తప్ప అన్యము కాదు. ఈనాడు లోకములో తల్లి ప్రేమ ఉంది. తండ్రి ప్రేమ ఉంది. సోదరుని ప్రేమ ఉంది. బంధువుల ప్రేమ ఉంది. మిత్రుల ప్రేమ ఉంది. ప్రేమయందు అంతో యింతో స్వార్థము ఉంటున్నాది. కాని, ఎట్టి స్వార్థము లేని ప్రేమ దైవ ప్రేమ ఒక్కటే! మీ నుండి యేమీ కోరదు. దైవము మీనుండి దేనినీ ఆశించదు. తనకు పాదము మొదలుకొని తల వరకు నిస్వార్థమే! పరిపూర్ణమైన ప్రేమయే! అట్టి ప్రేమస్వరూపమైన భగవంతునే ప్రేమిస్తూ రావాలి. పాపభీతి ఉన్నప్పుడు దైవప్రీతి ప్రారంభమౌతుంది. అట్టి ప్రీతిగల మానవుని సమాజము గౌరవిస్తుంది. ఈనాడు సమాజములో గౌరవము పొందవలెనంటే దైవప్రేమనే మనము సాధించాలి. దైవప్రేమను సాధించవలెనంటే పాపభీతిని మనం పెంచుకోవాలి. ఎట్టి పాపము మనలో యేమాత్రమూ ప్రవేశించకూడదు.

*పరోపకారమే పుణ్యం, పరపీడనమే పాపం*

పాపమంటే ఏమిటి? మన భారతీయ సంస్కృతియందు 'పరోపకారఃపుణ్యాయ పాపాయ పరపీడనం' అన్నారు. help ever, hurt never. అయితే ఏది పాపము? దేహమునే తానుగా భావించి, దేహముయొక్క సదుపాయముల నిమిత్తమై, దేహము అనుకూల నిమిత్తమై స్వార్థము చేత మనము కొన్ని మార్గములలో ప్రవేశిస్తాము. పర ఉప కర, పర అనగా ఆత్మ, ఉప సమీపము, కర చేయుట. ఆత్మకు సమీపముగా పోయేదే పుణ్యము అన్నారు. అనగా దైవత్వమునకు సమీపముగా పోవటమే పుణ్యము అన్నారు. పర పీడనం. పర అనగా పరమాత్మయే, పీడనం విస్మరించటం. పరమాత్మ తత్త్వమును విస్మరించటమే పాపమన్నారు. దివ్యత్వమును మరచిపోవటమే పాపమని, దివ్యత్వమును స్మరించటమే, విశ్వసించటమే పుణ్యమని దాని అంతరార్థము. ప్రతి మానవునియందు దైవత్వమును విశ్వసిస్తూ రావాలి. అప్పుడు ద్వేషమునకుగానీ, పాపమునకుగానీ అవకాశముండదు. కానీ, ఈనాటి యువతీయువకులు తమయొక్క వయఃప్రభావము పురస్కరించుకొని ఓపికను కోల్పోతున్నారు. తద్వారా ద్వేషము, అహంకారము, అసూయ అభివృద్ధి అవుతున్నాయి.

*అంహంకార నిర్మూలన*

ప్రేమస్వరూపులైన యువతీయువకులారా!

ఈనాడు లోకములో ఏ వైద్యమునకు నివారణకాని రోగము అందరియందు ఉంటున్నది. కొందరియందు తక్కువగా ఉండవచ్చు. కొందరియందు ఎక్కువగా ఉండవచ్చు. క్వాంటిటీ భేదమేగానీ క్వాలిటీ ఒక్కటే. ఆ రోగము ఏమిటి? అదియే అహంకారమనే రోగము. ఏ వైద్యమునకు నివారణ కాదు. కనుక, ఈనాడు ప్రపంచమంతయు అనేక జబ్బులతో పీడింపబడే రోగిగా కనిపిస్తున్నది. అన్ని రోగములకంటె ఈ అహంకారము చాలా హీనమైన రోగము. ఈ అహంకారము అజ్ఞానము చేత ప్రారంభమౌతుంది. ఈ అజ్ఞానము పోవాలంటే అవిద్య పోవాలి. ఈ రెండూ పోయినప్పుడే అహంకారము నిర్మూలమవుతుంది. దేనిని చూచి అహంకారపడుతున్నావు?

యువతీయువకులారా! దీనికి రెండు రకములైన మార్గములుంటున్నాయి. అహంకారము నిర్మూలముగావించుకొనుటకు రెండు ప్రశ్నలు మనం వేసుకోవాలి. ప్రపంచమంతా ఎంతో పెద్ద గ్లోబుగా కనిపిస్తున్నది. ఇంత పెద్ద ప్రపంచములో ఇండియా చిన్నదిగా ఉంటున్నది. ఈ ఇండియాలో ఆంధ్రప్రదేశ్ ఎంత చిన్నదిగా ఉంటున్నది! ఈ ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం జిల్లా ఎంత చిన్నదిగా ఉంటున్నది! ఈ అనంతపురం జిల్లాలోపల ప్రశాంతినిలయం ఎంత చిన్నదిగా ఉంటున్నది! ఈ ప్రశాంతినిలయములో నేనెంతటి వాడను! ఇంత అల్పమైన మానవుడు అనంతమైన ప్రపంచమును చూచి అహంకార పడటం పెద్ద అజ్ఞానమే కదా! ఆధ్యాత్మిక మార్గములో విచారించినప్పుడు 'ఈశావాస్యమిదం జగత్, సర్వం ఖల్విదం బ్రహ్మ'. ఎక్కడ చూచినా దైవత్వమే. అందరియందు నివసించేవాడు భగవంతుడే అనే ఏకత్వ భావము మనము గుర్తించినప్పుడు ఎవరిపై నీవు గర్వపడటం? అందరియందున్నది ఒకే దివ్యమైన శక్తి. అనేక బల్బులు మనకు కనిపిస్తున్నాయి. బల్బులు వేరువేరుగా ఉంటున్నాయి. అన్నింటియందున్న కరెంటు ఒక్కటే అనే సత్యాన్ని గుర్తిస్తే ఈ భేదము మనకు యేమాత్రమూ ఉండదు. ఆధ్యాత్మిక మార్గములో అంతా ఒక్కటే అనే ఏకాత్మ భావాన్ని గుర్తించాలి. వ్యావహారిక దృష్టిలో ఇంత ప్రపంచములో నేను అల్పుడనని గుర్తించాలి. అయితే ఈ ఆధ్యాత్మిక తత్త్వములో 'అణోరణీయాన్ మహతో మహీయాన్'. ఎలాంటి పరిస్థితులు సంభవించినా మన దివ్యత్వమును మార్చుకోకూడదు.

ఎక్కువ సంపదలొచ్చినగాని ఏనుగు గుఱ్ఱములెక్కినగాని
పిచ్చోడని లోకము అన్నాగానీ అందరు నిన్నే మెచ్చినగానీ
మంచిని మరువకురా దేవుని విడుకురా!

రెండింటిని మనము చక్కగా గుర్తుపెట్టుకోవాలి. మంచిని మరువకూడదు. దేవుని విడువకూడదు. ఎలాంటి పరిస్థితులు ప్రాప్తించనా స్థిరముగా దృఢనిశ్చయముతో ఉండాలి. అది ఈనాటి యువతీయువకుల లోపల కొంత అభివృద్ధి కావాలి.

ఆశలు పెంచకు ఆదర్శములు మరువకు

ఈ ప్రపంచమునకు సరైన నాయకులు, సరైన రక్షకులు, సరైన పోషకులు ఈనాటి యువతీయువకులే. మీ ప్రవర్తనలు పవిత్రమైన ప్రవర్తనలుగా మార్చుకోవాలి. దైవముయొక్క ప్రేమను మీరు అనుభవించాలి. అదియే ఇందూలాల్ షా చెప్పాడు. 'my life is my message' అని స్వామి చెప్పే ప్రతి విషయము ఈ ఆదర్శములే. ఎప్పుడూ ఆదర్శములను విడువకూడదు. కానీ, ఈనాటి ప్రపంచములో ఆశలు పెంచుకుంటూ ఆదర్శములు మరచిపోతున్నారు. దేహాభిమానము పెంచుకుంటున్నారు. దేశాభిమానము విస్మరిస్తున్నారు. దేశమును మరువకూడదు. మరిస్తే దేహము మరువు. ప్రాచీన మహర్షులు,పెద్దలు ఆదర్శజీవితమును అందిస్తూ వచ్చారు. త్యాగమునకు పట్టాభిషేకము చేశారు. న్యాయమునకు కంకణము తొడిగారు. సత్యమునకు స్వాగతము చేశారు. త్యాగమును విశ్వసించారు. ఇది ఆనాటి పెద్దల యొక్క ఆచరణ. అందువల్లనే ఆనాటి పెద్దలు ఏ

అశాంతికిగాని, కష్టములకుగాని గురికాలేదు. నిరంతరము శాంతిభద్రతలతో జీవిస్తూ వచ్చారు. ఈనాటి మానవులకు క్షణక్షణము విచారములే. కారణము ఏమిటి? వీరియందు త్యాగము లేదు. ధర్మము లేదు. సత్యము లేదు. ఈ మూడూ లేనప్పుడు శాంతి ఏరీతిగా లభిస్తుంది? ఈనాటి యువతీయువకులంతా త్యాగమునకు పట్టాభిషేకము చేయాలి. న్యాయమనే కిరీటము ధరించాలి. సత్యమనే ఖడ్గము ధరించాలి. ఇవియే మన సంరక్షణకుగానీ, దేశ సంరక్షణకుగానీ ప్రధానమైన ఆయుధములు. ఈనాడు ఇట్టి పరిస్థితులకు సరైన ఆదర్శము లేకపోవటముచేత ప్రపంచమంతా కుళ్లి కుమిలిపోతున్నది. ప్రతి మానవుడు సుఖముగా ఉండినట్లు నటిస్తున్నాడుగానీ హృదయమంతా మాలిన్యములతోనే, దుఃఖములతోనే కుమిలిపోతున్నది. కనుక, ప్రతి మానవుడు లోపల నున్న ఆనందమును బహిర్గతము గావించుకోవాలి. ఎవరినీ మనము ద్వేషించరాదు. దైవమును ప్రేమించాలి. దైవమును ప్రేమించినప్పుడు యితరులపై ద్వేషము యేనాటికీ రాదు. కనుక, యువతీయువకులు ఏవిధమైన జీవితము గడపాలని, వారి జీవిత ప్రధాన లక్ష్యమేమిటని తాము గుర్తించుటకు పూనుకోవాలి. హృదయములోనున్న మాలిన్యమును కడిగివేయండి. అప్పుడే పాత్రలో ఏమైనా నింపుకోవచ్చు.

ఏమిలేని బుఱ్ఱలోన యేమైనను చేర్చవచ్చు
ఏమేమో నిండియున్న బుఱ్ఱ నింప వీలుకాదు
కలి బోధలు నిండియున్న తలబుఱ్ఱది ఖాళియగున
తలబుఱ్ఱది ఖాళికాక యిల సుకృతంబు నింపనగునా!

మొట్టమొదట మన తలలోనున్న దుర్గుణములను, దురాలోచనలను దూరము చేయాలి. నిర్మలమైన చిత్తమును, నిస్వార్థమైన చేతలను మనము అనుభవించాలి. ఎక్కడ ఉండినా సేవ, సేవ, సేవ. సేవగా మనం భావించాలి. ఇదే hands in the society, head in rhe forest. కనుక, మనము ఏ సేవలో పాల్గొన్నప్పటికీ హృదయమునకుగానీ, తలకుగానీ ఏవిధమైన విచారమునకు అవకాశము నందించకూడదు. అచంచలమైన మనస్సును, నిశ్చలమైన దృష్టిని యీనాడు మనం పెంచుకోవాలి. అప్పుడే బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. నీవు దైవ భావములు పొందినప్పుడు నీవు దైవముగానే మారతావు. నీవు మృగ భావములు పెట్టుకోటం వలన నీవు మృగముగానే మారిపోతావు. నీవు రాక్షస భావము పెట్టుకున్నప్పుడు నీవు రాక్షసుడే అయిపోతావు.

*మంచితనం లేని గొప్పతనం నిష్ప్రయోజనం*

అన్ని దేశముల వారికి, అందులో భారతదేశము వారికి మరింత అనుభవము.రామాయణమునందు మహా విద్యావంతుడు రావణాసురుడు. అంతటి విద్యావంతుడే రాముడు కూడా. ఈనాడు విద్యలు చదువుతున్నాం మనం. మంచివారు చదువుతున్నారు. చెడ్డవారు చదువుతున్నారు. ఇరువురు విద్య అభ్యసిస్తున్నారు. రెండు విషయములు విచారించాలిక్కడ. గొప్పవారు కావాలని కొంతమంది ఆశిస్తుంటారు. మంచివారు కావాలని కొందరు ఆశిస్తుంటారు. మంచికి గొప్పకు ఉండిన భేదము ఏమిటి? మంచివానికి, గొప్పవానికి వ్యత్యాసముంటున్నాది. తల్లిదండ్రులు తమ కుమారుడు గొప్పవాడు కావాలని అనుకుంటారు. దేనిలో గొప్ప? వారికి తెలియదు. గొప్ప చదువులు చదవాలి, గొప్ప ఉద్యోగములు చేయాలి, ధనము సంపాయించాలి. ఇదే గొప్పదనమని భావిస్తున్నారు. కానీ, మంచివారు కావాలని ఆశించటము ఎంత మంచిది. కానీ, ఎవరూ గుర్తించుటకు ప్రయత్నించటం లేదు. నారాయణునియందు నరుని దర్శించిన వాడు గొప్పవాడు. నరునియందు నారాయణుని దర్శించినవాడు మంచివాడు. నరునియందు నారాయణుని దర్శిస్తే అదే మంచితనము. మంచితనము లేకుండా గొప్పదనముండి ప్రయోజనము లేదు. కాబట్టి, మంచితమును సంపాయించాలి. గొప్పతనము మనకు అక్కరలేదు. ఈనాడు ఎంతోమంది గొప్పవారున్నారు. వారి వలన దేశమునకు కల్గిన ఉపయోగమేమిటి? రావణుడు చదివాడు. రాముడు చదివాడుగానీ యిందులో మంచివాడు రాముడు, గొప్పవాడు రావణుడు. ఏవిధంగా గొప్పవాడు? గొప్ప తపస్సు చేశాడు. కానీ, చదివిన చదువును జీర్ణించుకోలేదు. అందుచేత అజీర్ణ రోగము అతనికి ప్రారంభమైంది. ఆ అజీర్ణ రోగమే అజ్ఞానము. ఈ అజ్ఞానము నుండి ఆరంభమైనవే

దుర్గుణములు. తన వాంఛలను తాను నిర్మూలనము చేసుకోలేక తన వంశమునే నాశనము చేసుకున్నాడు. తన తలంపులను తాను అరికట్టుకోలేక తన తమ్ములనే చంపుకున్నాడు. కోరికలను అదుపులో పెట్టుకోలేక కొడుకులను చంపుకున్నాడు. రోగములను అదుపులో పెట్టుకోలేక రాజ్యమునంతా భస్మము చేసుకున్నాడు. దీనికి కారణము ఏమిటి? చదువుకున్నవాడైనా అతనిలో దుర్గుణములు, దురాలోచనలు, దుచ్చింతలు ఉన్నాయి. రాగము లేకపోతే రాక్షసులు నశించి ఉండరు. వాంఛలు లేకుండా ఉంటే వంశమే నాశనము చేసుకొని ఉండరు. తలంపులే తనలో లేకపోతే తమ్ములను చంపుకొని ఉండడు. కోరికలే లేకపోతే కొడుకుని చంపుకొని ఉండడు. ఈ కోరికలు, రాగములు, తలంపులే మానవునింత రాక్షసునిగా రూపొందింప చేస్తున్నాయి.

కనుక, ఉండవలసినది ఒకే ఒక కోరిక. అదే దైవప్రీతి, పాపభీతి. ఈ రెండింటిని మనం చక్కగా తీసుకుంటే ఎంతటి మంచివారైనా కావచ్చు. రాముడు సత్యమునకు అంకితమయ్యాడు. ధర్మానికి అంకితమయ్యాడు. 'సత్యం వద, ధర్మం చర'. సత్యము చెబుతూ వచ్చాడు. ధర్మమును అనుసరిస్తూ వచ్చాడు. అందువలనే మంచివాడయ్యాడు. ఎన్ని వేల సంవత్సరములు గడచినప్పటికీ ఇప్పటికిని 'రామా' అంటే గౌరవమును అందుకోగల్గుతున్నాడు. మానవునియందు మాధవత్వమును చూపించాడు రాముడు. అది మంచితనము. దేవునిలో నరుని చూడటం మంచితనం కాదు. అది నీ imagination, నీ reflection, నీ resound, నీ reaction. నీవు మానవునిగా ఉంటున్నావు. అతనిని మానవునిగా తలచుకుంటున్నావు. దైవములో మానవుని చూడటంలో నీ మంచితనము యేమున్నది? కాదుకాదు. మానవునియందు కూడా దైవమును చూడాలి. అది మంచితనం. మంచితనమునకు, గొప్పతనమునకు వ్యత్యాసము మనము చక్కగా గుర్తించాలి. మనము మంచివారము కావాలిగానీ గొప్పవారము కానక్కరలేదు. గొప్ప ధనము ఉండవచ్చు. గొప్ప విద్య ఉండవచ్చు. గొప్ప బలము ఉండవచ్చు, అధికారము ఉండవచ్చు. ఇవి ఎంత వరకు? నీకు అధికారము ఉండినంత వరకే. తదుపరి ఎవరు, ఇంటిలో వారుకూడా గౌరవించరు. ప్రైమినిష్టరుగా ఉంటే ఆ పదవి ఉండినంత వరకు అనేకమంది అతని యింటికి తిరుగుతుంటారు. ఆ పదవినుండి రిటైర్ అయిన తక్షణమే రిక్షావాడు 'అయ్యా! డబ్బు యియ్యి' అంటాడు. ఈ గొప్పతనము నేడు ఉంటుంది. రేపు పోతుంది. మంచితనము శాశ్వతముగా ఉంటుంది. అందువలనే మంచికి మన జీవితాన్ని అంకితము చేయాలి. మంచితనమంటే ఏమిటి? ధర్మంగా ఉండటం. న్యాయంగా జీవించటం. అందరినీ ప్రేమించటం. దైవమును విశ్వసించటం. బీదలను ప్రేమించటం. దిక్కులేని వారిని ఆదరించటం. ఇవన్నీ మంచితనముయొక్క లక్షణములు. కనుక, ఈనాడు మంచి గుణములు, పవిత్రమైన గుణములు మనం అభివృద్ధి పరచుకోవాలి.

*నామస్మరణే కర్తవ్యం*

యువతీయువకులారా! ఈనాడు ప్రారంభోత్సవము జరిగింది. కనుక, ఈనాడు కేవలం ఒక మాస్టరు ప్లాను మాదిరి ఏవిధంగా ఉండాలనేది విచారించుకుందాం. మున్ముందు మీరు చేయవలసిన కర్తవ్యములు, కర్మలు, బాధ్యతలు, ఆచరణ ఏవిధంగా ఉండాలో ముచ్చటించుకుందాం. అన్నింటికి ప్రధానమైనది ఆధ్యాత్మిక మార్గంలో నామస్మరణే. భగవంతుని నామం చేత నామిని పొంద వచ్చును. కనుక, నామస్మరణ అమితంగా పెంచుకోవాలి. ఆ నామస్మరణ కూడా ప్రేమతో చేయాలి.

..........

(1997 జూలై 16వ తేదీ సాయీకుల్వంత్‌లో యువతీయువులకు భగవాన్ బాబావారి సందేశము)